"తృపికరమైన ధర ముట్టింది." చెప్పి, ఆ దుకాణం యజమాని ఆ ముత్యాన్ని ఆ బిచ్చగాడికి ఇచ్చేసాడు.

'మోక్షం' అనే ఆ ముత్యాన్ని అమ్మే దేవుడు నిర్ణయించిన ధర ఇది. 'నాది' అన్నది మిగుల్చుకోకుండా సర్వం దేవుడి చేతిలో మనం పెట్టగలిగితే, ఆ ముత్యం ఎవరికైనా లభ్యమే.

## 40. ఓ డైరీలో కొన్ని పేజీలు

సోమవారం:

ఈ రోజు నేను బస్సులో ఎర్రటి పంజాబీ డ్రస్‌లో ఉన్న ఓ అమ్మాయిని చూసాను. ఆమెలా నన్ను కూడా అందంగా పుట్టించనందుకు నీ మీద నాకు కోపం వచ్చింది. కాని ఆమె తన బస్సు స్టాప్ రాగానే దిగడానికి లేచినప్పుడు ఊత కర్ర సాయంతో బస్సు దిగింది.

నీ మీద కోపం తెచ్చుకున్నందుకు నన్ను క్షమించు దేవా! నాకు నడవడానికి రెండు కాళ్ళు ఇచ్చినందుకు కృతజ్ఞురాలిని.

మంగళవారం:

ఎఫ్ యంలో ఓ డి. జె ఎంతో హుషారుగా మాట్లాడుతూంటే, అతని జీవితం ఖచ్చితంగా ఆనందమయం అయివుంటుంది అని అనిపించింది. నాకు అలాంటి జీవితం ఇవ్వనందుకు నీ మీద మళ్ళీ నాకు కోపం వచ్చినందుకు నన్ను క్షమించు దేవా! ఆ డి జె గుడ్డివాడని ఇందాక పేపర్లో చదివి తెలుసుకున్నాను.

నాకు పని చేసే రెండు కళ్ళని ఇచ్చినందుకు నీకు నేను కృతజ్ఞురాలిని.

బుధవారం:

ఇందిరా పార్క్‌లో స్కూలు యూనిఫారాల్లో వచ్చిన పిల్లలంతా ఆడుకుంటూంటే, చూడముచ్చటగా ఉన్న ఓ పిల్లవాడ్ని చూసి నువ్వు నాకు అలాంటి కొడుకుని ఇవ్వనందుకు నీ మీద మనసులోనే కోపగించుకున్నాను. వారితో కలిసి ఆడుకోకుండా ఒంటరిగా జారుడుబండ మీద జారుతున్న అతని దగ్గరకి వెళ్ళి పేరు అడిగితే బిత్తరపోతూ నావంక చూసాడు.

ఆ స్కూలు పిల్లల్లో ఒకరు నా దగ్గరకి పరిగెత్తుకొచ్చి వాడి వైపు జాలిగా చూస్తూ చెప్పారు.

"ప్రదీప్‌కి చెవుడు. మనం ఏం మాట్లాడినా వినపడదు."

ఓ దేవా! నా కొడుక్కి వినబడే రెండు చెవులు ఇచ్చినందుకు నీకు కృతజ్ఞురాలిని.

గురువారం:

ఇవాళ మిని రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌కి వెళ్ళి, అక్కడి చిత్రాలని చూసాను. నాకలాంటి నైపుణ్యం ఇవ్వని నీ మీద నాకు కోపం వచ్చినందుకు నన్ను క్షమించు దేవా! అతని రెండు చేతులూ చచ్చు పడిపోయాయి కాబట్టి ఆ చిత్రాలని అతను తన నోటితో గీసాడు!!

శుక్రవారం:

ఇవాళ హోటల్‌లో ఓ జంటని చూసాను. వెయిటర్ రాగానే తన భార్యని సంప్రదించకుండా భర్త ఆమెకి ఇష్టమైనవి ఆర్డర్ చేయడం చూసాక, భార్య అభిరుచులని తెలుసుకోలేని భర్తని నాకిచ్చినందుకు నీ మీద నాకు కోపం వచ్చింది. కాని ఆమె మూగదని తెలియగానే నన్ను మూగదానిగా పుట్టించనందుకు నీకు కృతజ్ఞతలు చెప్పకుండా ఉండగలనా దేవా?

శనివారం:

ఓ దేవుడా! ఈ రోజు నేను అందమైన ఓ ఐ ఏ ఎస్ లేడీ ఆఫీసర్‌ని కలిసాను. ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా నించి బెస్ట్ ఐ ఏ ఎస్ ఆఫీసర్‌గా గోల్డ్ మెడల్ పొందిన ఆమెకి వీణా వాదన చక్కగా వచ్చు. టైమ్స్ ఆఫ్ ఇండియాకి కుటుంబ సమస్యల మీద వ్యాసాలు రాస్తుంది. ఐనా ఆమెకి ఎలాంటి అవకరాలు లేవు. ఆమెని ఉన్నతంగా సృష్టించిన నీకు ఆమె తరఫున నా కృతజ్ఞతలు.

ఆదివారం:

ఓ దేవుడా! నాకు లేనిది ఇతరుల్లో చూసి నేను అందుకు బాధపడకూడదన్న పాఠాన్ని ఈ వారం రోజులుగా నాకు నేర్పినందుకు, ఇతరులకి ఉన్నదల్లా నాకు కావాలనే కాంప్లెక్స్ నించి నన్ను బయటపడేసినందుకు నీకు సదా కృతజ్ఞురాలిని.